

గాజులరామారంలోని ఎన్టీఆర్‌నగర్‌లో సద్దాం ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. - గాజులరామారం, ఆంధ్రజ్యోతి

రూ.32 లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

గాజులరామారం, మే 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా క్యూఆర్ కోడ్ లేకుండా తరలిస్తున్న నగదును మేడ్చల్ ఎస్ఓటీ, సూరారం పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో సూరారం ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా టీఎస్ 10 యూడీ 0187 నెంబరు గల వాహనంలో 32 లక్షలా 54 వేలా నాలుగొందల రూపాయలను తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. నగదును తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మేము చేసిన అభివృద్ధి చూసి ఓటేయండి



కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

- జడ్పీచైర్మన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశా
- ఎంపీగా గెలిపిస్తే బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటా
- బీఆర్ఎస్ హయాంలో శివారు ప్రాంతాల అభివృద్ధి
- చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ఇప్పుడు ప్రజలు పదేపదే గుర్తుకు తెచ్చుకుంటున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పాలనలో అన్ని విధాలా విఫలమైందని.. ఏ ఒక్క హామీ సరిగా నెరవేర్చలేదన్నారు. గతంలో తమ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓట్లేయాలని ఆయన ప్రజలను కోరుతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. గతంలో తాను జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని.. ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే..

కాంగ్రెస్ చేసిందేమీ లేదు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మా వైపే ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. పేరుకే గ్యారెంటీలు కానీ ఒక్కదాన్నీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు. అందుకే ప్రజలు కూడా విసిగిపోయారు. ఎక్కడకు వెళ్లినా బీఆర్ఎస్ పాలనే బాగుందంటున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ మళ్లీ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్, నీళ్ల కోసం జనం అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నగర, శివారు ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు తాగునీటి కోసం విలవిల్లాడుతున్నారు. రుణమాఫీ లేదు.. రైతుబంధు లేదు... ఆడపిల్లలకు తులం బంగారం పథకం ఎక్కడకు పోయిందో తెలియదు. అధికార పార్టీ నేతల అబద్ధాలు, శుష్క వాగ్దానాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. బీజేపీ కూడా ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం నడపాలని చూస్తోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంతానికి ఏ ఒక్క మంచి పనీ చేయలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చుట్టూ కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును గంగలో కలిపారు. రాష్ట్రం కోసం ఒక్క ప్రాజెక్టునూ బీజేపీ నేతలు తీసుకురాలేకపోయారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

బడుగులకు బాసటగా ఉంటా..

చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒక్కటైన చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వెనుకబడిన వర్గానికి చెందిన నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. మాజీ మంత్రి కేటీఆర్, సబితారెడ్డి సహకారంతో పాటు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్యనేతల సహకారంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నాం. గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపించబోతున్నాయి. ప్రతిష్టాత్మకమైన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే బడుగులకు బాసటగా ఉంటాను. నా జీవితమంతా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే పాటుపడ్డాను. అణగారిన వర్గాల కోసం ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. నాకు ఇక్కడ నుంచి ఎంపీగా అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజలకు మరింత సేవ చేస్తాను. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కాలం పనిచేశాను. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఈ ప్రాంతంలో రోడ్లు, స్కూళ్లు నిర్మించడంతో పాటు తాగునీటి పథకాలను దాదాపు అన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు కృషి చేశాను. నేను ఈ ప్రాంతం వాడిని. ఈ ప్రాంత ప్రజలకు కొన్ని దశాబ్దాల అనుబంధం ఉంది. మిగతా అభ్యర్థులను కూడా బేరీజు వేసుకుని ఎన్నికల్లో ఓటు వేయండి. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలకు అంతా ఇంతా కాదు. ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజలంతా ఉత్సాహంతో సభలకు వస్తున్నారు.

111 జీవో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివార్లలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున కల్పించాం. కేటీఆర్ కృషితో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. ఇందువల్ల లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. అలాగే హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో అమల్లో ఉన్న 111జీవో వల్ల స్థానికంగా 83 ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాలు ఈ జీవో వల్ల అభివృద్ధికి నోచుకోక పోవడంతో మా ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసింది. గతంలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవోను రద్దు చేయడంతో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలిగింది. ఈ ప్రాంతంలో భూములు ఉన్న రైతులు సంతోషపడ్డారు. ఇక ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించేందుకు రూపుదిద్దిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎన్నో ఏర్పాటు చేసి పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాం. ఇలా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ చూసి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యం : అల్కా లంబా

పేట్‌బషీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సాధికారత సాధ్యమని కాంగ్రెస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు అల్కా లంబా అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కొంపల్లి మున్సిపల్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నారీ న్యాయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె, ఎన్నికల అబ్జర్వర్ తమిళనాడు ఎంపీ జ్యోతి మణి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్కా లంబా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలంతా లబ్ధి పొందుతున్నారని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ప్రతీ మహిళకు ఏడాదికి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందుతుందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలే ప్రజలను సంక్షేమం వైపు నడిపిస్తాయని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించేందుకు నిరంతరం నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు సముచిత స్థానం, గౌరవం దొరుకుతుందన్నారు. మహిళగా తోటి మహిళలంతా తనకు తోడుగా నిలబడాలని, తనను గెలిపిస్తే మహిళలకు నైపుణ్యం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, స్వయంఉపాధి, ఉద్యోగ కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు భూపతిరెడ్డి , జోష్నా, పున్నారెడ్డి, సరిత, శోభారాణి, నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, డివిజన్ మహిళా నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అల్కాలంబా



రీట్వీట్ చేసిన కాపీపై మోదీ ఆటోగ్రాఫ్ తీసుకుంటున్న విజయలక్ష్మి

చిన్నారి పాటకు స్పందించిన మోదీ

- రీట్వీట్ చేసిన కాపీపై ఆటోగ్రాఫ్

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి కుమార్తె జశోధర 2023 డిసెంబర్ 9న దత్తాత్రేయ ఇంట్లో జరిగిన ఓ శుభ కార్యంలో పాటపాడింది. ఈ పాటను దత్తాత్రేయ మోదీకి అదే రోజు ట్వీట్ చేశారు. మరుసటి రోజు చిన్నారిని పొగుడుతూ మోదీ రీట్వీట్ చేశారు. రీట్వీట్ చేసిన కాపీని శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో మోదీకి విజయలక్ష్మి చూపించి దానిపై ఆటోగ్రాఫ్‌ను తీసుకున్నారు. జశోధర పాడిన పాటను తాను విన్నానని, ఆమెకు తన ఆశీస్సులు అని మోదీ తెలియజేసినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. తాను రీట్వీట్‌ను మోదీకి చూపించగానే తనకు గుర్తుందని చెప్పడం ఎంతో సంతోషం కలిగిందన్నారు.

గుర్తింపుకార్డులు లేని వారిని అనుమతించొద్దు: కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): గుర్తింపుకార్డులు లేని ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్వాన్, బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాలను, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, చార్మినార్ డీఆర్‌సీ సెంటర్లలోని ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల్లో పోలింగ్ ముందు రోజు సిబ్బంది ఉండేందుకు గదులను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయిన వెంటనే బాక్స్‌లను, హోమ్ ఓటింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌రూంలో భద్రపరచాలని సూచించారు.

రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లు స్వాధీనం

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వినియోగదారుల సంస్థ ప్రతినిధులు
- నాలాలో పారేసిన పోలీసులు

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): రసాయనాలతో పండించి విక్రయిస్తున్న మామిడి పండ్లను వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారని రామగిరి హరిబాబు వినియోగదారుల హక్కుల సంస్థలో ఇటీవల ఫిర్యాదు చేశాడు. శుక్రవారం వినియోగదారుల హక్కుల సంస్థ సభ్యులు ఇందిరాపార్కు వద్ద మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి వద్దకు వెళ్లారు. ఆటో ట్రాలీలో డబ్బాల్లోగల మామిడి పండ్లలో కెమికల్ ప్యాకెట్లు పెడుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వ్యాపారిపై దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది వాటిని పరిశీలించారు. రసాయనాలతో పండించినవని తేలడంతో 200 కిలోల మామిడిపండ్లను వ్యాపారస్థుడి నుంచి స్వాధీనం చేసుకొని గాంధీనగర్ నాలాలో పారేశారు.

ఆర్.కృష్ణయ్యపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బర్కత్‌పుర/అంబర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఆయనపై జరిగిన దాడిని బీసీ సమాజంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో పలు బీసీ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు.

పార్లమెంట్ ఎన్నికలకు శేరిలింగంపల్లిలో ఏర్పాట్లు పూర్తి

- 633పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

గచ్చిబౌలి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జోనల్ కమిషనర్ స్నేహషబరీష్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 7,58,268 మంది ఓటర్లు ఉన్నారని అందుకు అనుగునంగా 633 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందుకు అనుగుణంగా ఈవీఎంలను ఏర్పాటు చేశామన్నారు. 1460 మంది సిబ్బంది పాల్గొంటున్నారని అదనంగా ఈవీఎంలు, సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి రెండుదశలో శిక్షణ ఇచ్చామని, పోలింగ్ కేంద్రాలను విభజించి సెక్టార్ అఫీసర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 95 శాతం మందికి ఓటర్లు స్లిప్‌లు అందజేశామని వివరించారు. 14 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించామని ఆయా ప్రాంతాల్లో భారీ బందోబస్తు, ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.50 కోట్లు, 9.50 కేజీల బంగారం, సుమారు 40 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశామని డీసీపీ వివరించారు. నియోజకవర్గంలో పోలింగ్ రోజు 8 బృందాలు గస్తీ తిరుగుతాయని, ఆయా ప్రాంతాల్లో పికటింగ్ కూడా ఏర్పాటు చేశామని, ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించినట్టు వివరించారు. పోలింగ్ రోజు 24 గంటల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు ఈ విషయం గమనించి గుంపులుగా తిరగకూడదని వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న స్నేహ షబరీష్

గుజరాత్ టీంను ఓడించాలి

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి


ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్, సీతారంజిత్‌రెడ్డి, కాల్వ సుజాత

మియాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మే 13న జరిగే ఎన్నికల్లో గుజరాత్ టీంను ఓడించి కాంగ్రెస్ టీంను గెలిపించాలని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి కోరారు. మియాపూర్ నరేన్‌గార్డెన్‌లో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, సీతారంజిత్‌రెడ్డి, కాల్వ సుజాత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రజలను విస్మరించారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

సీఎం ప్రజల కోసం పనిచేసే కష్టజీవి

సరూర్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం రాత్రి బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్‌ల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగ్‌నగర్ కమాన్ నుంచి బడంగ్‌పేట్ గణేశ్ చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చే సిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేపడుతున్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకున్న వ్యక్తి అని, ఆయన నిరంతరం ప్రజల కోసం పనిచేసే కష్టజీవి అని ఆయన అన్నా రు. చేవెళ్లలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పాలనను చూడండి.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టండి అని ఆయన ఓటర్లకు సూచించారు. ఈ సారి కేంద్రంలోనూ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కొలువుదీరనున్నదని కొండల్‌రెడ్డి పేర్కొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే

ఎల్‌బీనగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి పారుపల్లి దయాకర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, బోయిని మహేందర్‌యాదవ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్, శంకర్‌నగర్, ఇంద్రహిల్స్, కృష్ణానగర్, జైస్వాల్‌కాలనీలలో పార్టీ శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి వారు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, సుదర్శన్‌ముదిరాజ్, నర్సింహగౌడ్, నగేష్‌గౌడ్, కందుల రాము, లక్ష్మయ్య, నాగమణి, శశికళ, సత్తియాదవ్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే హవా

సరూర్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్నదని, వాటి వల్లనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాదరణ చూరగొన్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి అన్నా రు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి గుర్రంగూడ, అల్మాస్‌గూడ గ్రామాల్లో, శుక్రవారం బాలాపూర్, బడంగ్‌పేట్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అదేవిధంగా బాలాపూర్‌కు చెందిన పలువురు ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.


బడంగ్‌పేట్ రోడ్ షోలో కొండల్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు


సరూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బేర బాలకిషన్, దయాకర్‌రెడ్డి

కేసీఆర్ బస్సుయాత్రతో..

కాంగ్రెస్, బీజేపీ నేతల్లో వణుకు

మాజీమంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి


పరిగిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పి.సబితారెడ్డి

పరిగి, మే 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో వణుకు పుట్టిందని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. శుక్రవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో పరిగి మండలం, మునిసిపల్ పరిధిలోని బీఆర్ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఓటమి భయంతోనే బడాబాయి (మోదీ), చోటాబాయి (రేవంత్‌రెడ్డి)లు కలిసి రెండు రోజుల పాటు కేసీఆర్ ప్రచారాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకునేలా కుట్ర చేశారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందని తెలిపారు. రేవంత్‌పాలన ఐదునెలల్లోనే గాడి తప్పిందని విమర్శించారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని పటించుకోని బీజేపి ప్రభుత్వానికి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ టికెట్లు ఇవ్వడంలో బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గారడీ మాటలు తప్పా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్ మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఆ పార్టీకి ఓటేయ్యాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్సీ గట్టు రాంచందర్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, రైతుబంధు మాజీ చైర్మన్ ఎం.రాజేందర్, కె.అనిల్‌రెడ్డి, ఆర్.అంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

● చేవెళ్లలో మూడోసారీ విజయం మాదే..

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం కొండాపూర్ సాయినగర్ వెస్ట్‌కాలనీ, రాఘవేంద్రకాలనీవాసులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధికి మారుపేరైన బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. సాయినగర్ వెస్ట్‌కాలనీ, రాఘవేంద్రకాలనీవాసులు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

● తారానగర్‌లో ప్రచారం

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్, లింగంపల్లిలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు న్యాయం చేసిన బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

● నేతాజీనగర్‌లో..

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శుక్రవారం నేతాజీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

● అయ్యప్ప సొసైటీ వాసుల మద్దతు

మాదాపూర్: మాదాపూర్ అయ్యప్పసొసైటీ వాసులతో శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన స్థానికులు కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అయ్యప్ప సొసైటీవాసులు జ్ఞానేశ్వర్‌కు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞులు తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


నేతాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా


తారానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

బీఆర్ఎస్ హయాంలోనే కూకట్‌పల్లి అభివృద్ధి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పార్కులో వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అల్లాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఉదయం ఆరు గంటలకే పాదయాత్ర ప్రారంభించి పార్కులో వాకర్స్‌తో కలిసి ముచ్చటిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పార్కులు, క్రీడా మైదానాలు, బాలనగర్ ఫ్లై-ఓవర్ నిర్మాణం, ఇండోర్ స్టేడియం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ అభివృద్ధికంతటికి కేసీఆర్‌దే ఘనత అని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంలా తయారు చేసిన బీఆర్ఎస్‌నే గెలిపించాలని ఎమ్మెల్యే కృష్ణారావు పిలుపునిచ్చారు.

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యనేతలు, కార్పొరేటర్‌లతో సమావేశం నిర్వహించారు. ఇక రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కాంగ్రెస్, బీజేపీ పార్టీలవి దిగజారుడు రాజకీయాలు

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం: దేవుని అక్షింతలు అంటూ ప్రజలను మభ్యపెడుతూ మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుని మీద ఒట్లు వేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు.


● లక్ష్మారెడ్డికి మద్దతుగా శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన మల్లంపేట, బౌరంపేట కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

● లక్ష్మారెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మ యాదవ్ మజీద్, ఈద్గా వద్ద ప్రచారం చేశాడు.


ఫ్లాగ్‌మార్చ్‌లో పోలీసులు

మణికొండలో ఫ్లాగ్‌మార్చ్

రాయదుర్గం: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు మణికొండ మర్రిచెట్టు నుంచి దర్గా వరకు సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులకు ఫ్లాగ్‌మార్చ్ శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు నిర్వహించుకునేలా శాంతిభద్రతలపై అవగాహన కల్పించామని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. ఎవరైన ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చెరువులో పడి బిహార్‌వాసి మృతి

పేట్‌బషీరాబాద్, మే 10(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చిన కూలీ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మైసమ్మగూడ శుక్రవారం చోటు చేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన గుడ్డు పాశ్వాన్(27) బతుకుదెరువు కోసం మైసమ్మగూడకు ఎనిమిది నెలలు క్రితం వచ్చి ఎస్. శేఖర్ అనే వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రోజూ మాదిరిగానే ఉదయం పశువులను మేపడానికి బయటకు తీసుకెళ్లాడు. పశువులు మైసమ్మగూడలోని కోమటిచెరువులోకి దిగడంతో వాటిని బయటకు రప్పించడానికి చెరువు వద్దకు పాశ్వాన్ వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలోనే మునిగిపోయాడు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయగా సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పాశ్వాన్ కోసం చెరువులో గజఈతగాళ్లతో గాలించారు. ఫలితం లేకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించారు. చెరువులో గాలింపు చేపట్టిన బృందం సభ్యులు నాలుగు గంటలు శ్రమించి పాశ్వాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

మల్లంపేట రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎండీ


రిజర్వాయర్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే10 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీరు సరఫరా చేసేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2 లోని మల్లంపేట రిజర్వాయర్‌ను ఎండీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అనంతరం అదే మండలంలోని బాచుపల్లి ఫిల్లింగ్ స్టేషన్‌ను సందర్శించి.. ట్యాంకర్ల వివరాలు తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్యాకేజీలో నిర్మిస్తున్న 38 రిజర్వాయర్లలో ఇప్పటికే 13 అందుబాటులోకి వచ్చాయన్నారు. మిగిలిన 25 రిజర్వాయర్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినట్లు తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసి జూన్ వరకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇందులో కొత్తగా 1,250 కిలో మీటర్ల మేర కొత్త పైపులైన్ వేస్తున్నామని, ఇది దాదాపు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. అలాగే ఇన్ లెట్, అవుట్ లెట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ల ప్రాంగణాల్లో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం రిజర్వాయర్ల ప్రాంగణంలో నిర్మించి పంప్ రూమ్‌ను ఎండీ పరిశీలించారు. కార్యక్రమంలో ఓఆర్ఆర్ సీజీఎం టీడీ శ్రీధర్, జీఎం సంతోష్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి

బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్


అశేష కార్యకర్తల మధ్య బస్తీలలో పాదయాత్ర చేస్తున్న ఈటల రాజేందర్

ఫతేనగర్, మే 10(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తేనే దేశాభివృద్ధి జరుగుతుందని, దీంతో దేశ ప్రజల బతుకులు బాగు పడతాయని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నియోజకవర్గ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఉదయం ఫతేనగర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వరావు, బీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు, మాజీ కార్పొరేటర్ ముద్దాపురం కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఫతేనగర్ బస్తీలలో చేపట్టిన రోడ్‌షోలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. దేశంలో శాంతిభద్రలు, దేశాభివృద్ధి జరగాలంటే మోదీ వల్లనే సాధ్యమని అన్నారు. అందుకే ప్రజలంతా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీని మళ్లీ ప్రధానిగా చూడాలి

జీడిమెట్ల: ఈ నెల 13వ తేదీన కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించి నరేంద్రమోదీని మళ్లీ ప్రధానిగా ఎన్నుకోవాలని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలో నాయకులతో కలిసి ఆయన రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదన్నారు. ఓడ ఎక్కేదాక ఓడ మల్లయ్య, ఒడ్డెక్కినాక బోడి మల్లయ్య అనే విధంగా వారి పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదని, ప్రతీ మహిళకు నెలకు 2,500 రూపాయలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు అమలు కాలేదన్నారు. అలాగే చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామనే హామీలు నేటికీ నెరవేరలేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దిదించాలనే కోరికతోనే కేసీఆర్‌ను ఓడించాలని, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేస్తే అవి వృథా అవుతాయన్నారు.

ఈటల సతీమణి ప్రచారం

పేట్‌బషీరాబాద్: ఈటల రాజేందర్ సతీమణి జమున కుత్బుల్లాపూర్‌లోని జీడిమెట్ల, భూమిరెడ్డి నగర్, మహానగర్ గణేష్‌హౌసింగ్‌కాలనీ, రుక్మిణీ ఎస్టేట్, వెన్నెలగడ్డ, జెడ్ఆర్ఐఓరి అపార్టుమెంట్‌ల్లో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డితో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీజేపీ కరపత్రాలను ఇంటింటా అందజేస్తూ, ఒక్కసారి ఈటల రాజేందర్‌కు అవకాశం ఇచ్చి చూడాలన్నారు. మల్కాజిగిరిలో అభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటు వెయ్యాలని ప్రచారం చేశారు.


ఈటల రాజేందర్‌ను పూలతో ఆశీర్వదిస్తున్న ముస్లిం మహిళ


అపార్టుమెంట్ వాసులతో జమున